ప్రచారం లేక.. ప్రయోజనం తెలియక



క్షయ వ్యాధి (టీబీ) నివారణ నిమిత్తం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది పీహెచ్‌సీల ద్వారా నిర్వహిస్తున్న బీసీజీ టీకా వ్యాక్సినేషన్ అంటే అమ్మో అంటూ పారిపోతున్నారు. నియోజకవర్గ పరిధిలో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ ఆశించినంత ఫలితాలు ఇవ్వకపోవటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో బీసీజీ టీకాలు వేసే కార్యక్రమం మందకొడిగా సాగుతోంది. వార్డుల్లోని సచివాలయాల పరిధిలో 60 సంవత్సరాలు దాటిన వారు, షుగర్ వ్యాధిగ్రస్తులకు టీబీ వంటి వ్యాధులు వ్యాపించకుండా ముందస్తుగా బీసీజీ టీకాలు సచివాలయాల వారీగా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ప్రజలకు దీనిపై అవగాహన కల్పించడంలో మాత్రం అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. దీంతో ప్రజల్లో అనేక అపోహలు తలెత్తుతున్నాయి.

- బీసీజీ వ్యాక్సిన్ వేసుకునేందుకు వృద్ధుల నిరాసక్తత
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- భయపడాల్సిన పని లేదంటున్న వైద్యులు




కుమ్మరవీధి సచివాలయం పరిధిలో బీసీజీ టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

అల్లిపురం: బీసీజీ వ్యాక్సినేషన్‌పై సమగ్రంగా అవగాహన కల్పించేలా పోస్టర్లు, కరపత్రాల పంపిణీ, అన్ని ప్రాంతాల్లో అవగాహన కల్పించేలా ప్రచారం చేపడితే దీని లక్ష్యం సులువుగా సాధించడానికి వీలుపడేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. కేవలం క్షేత్రస్థాయిలో మాత్రమే సచివాలయాల పరిధిలో నిర్వహించిన సర్వేలో గుర్తించిన 60 ఏళ్లు దాటిన వారందరికీ బీసీజీ వ్యాక్సిన్ వేయాలనే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టారు. దక్షిణ నియోజకవర్గంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (యూపీహెచ్‌సీ) ప్రస్తుతం ఈ కార్యక్రమం రెండు నెలలుగా కొనసాగుతోంది. సచివాలయం ఒక యూనిట్‌గా తీసుకుని ప్రతి సోమ, గురువారాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బీసీజీ టీకా వేస్తున్నారు.

లక్ష్య సాధనకు సిబ్బంది కుస్తీ...

60 ఏళ్లు దాటిన వారికి బీసీజీ టీకా వేయాలని వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో సరైన స్పందన లభించడం లేదు. కొబ్బరితోట, భీమ్‌నగర్, భానోజీనగర్, ప్రసాద్‌గార్డెన్స్, పాతపోస్టాఫీస్ యూపీహెచ్‌సీ పరిధిలో సుమారు 20 వేల మందికి టీకా వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 7 వేల మందికి మాత్రమే వేసినట్లు సమాచారం. నియోజకవర్గంలో మిగతా ఆరోగ్య కేంద్రాల పరిధిలో పరిస్థితి మరీ దారుణంగా ఉన్నట్లు తెలుస్తోంది. నిన్న మొన్నటి వరకు సచివాలయాల్లో టీకాలు వేసేవారు. ప్రజల నుంచి అంతగా స్పందన లేకపోవటంతో లక్ష్య సాధనకు సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు (ఏఎన్ఎం), ఆశ వర్కర్లు ఇంటింటికీ క్యారియర్‌తో తిరిగి వ్యాక్సిన్ వేస్తున్నారు. కానీ ప్రజలు అపోహలకు గురై టీకా వేసుకునేందుకు ముందుకు రాకపోవటంతో పురోగతి కనిపించడంలేదు. దీంతో లక్ష్య సాధనకు వైద్య సిబ్బంది పాట్లు పడాల్సి వస్తోంది.

ఎవరు వేసుకోవాలి..

హృద్రోగం, బైపాస్ సర్జరీ చేయించుకున్నవారు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు మాత్రం బీసీజీ టీకాలు వేసుకోరాదని సిబ్బంది సూచిస్తున్నారు. ముఖ్యంగా షుగర్ ఉన్నవారు, 60 సంవత్సరాలు పైబడిన వారు, గత 5 ఏళ్లలో టీబీ పేషెంట్స్ ఉన్న ఇళ్లలో గల కుటుంబ సభ్యులు అందరికీ, 18 సంవత్సరాలు పైబడిన వారికి, శరీర బరువు 18 కేజీల కన్నా తక్కువ ఉన్న వారు, పొగాకు ఉత్పత్తులు వాడుతున్న వారు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేసుకోవాలని చెబుతున్నారు.

ఎవరు వేసుకోకూడదు..

18 సంవత్సరాలు లోపువారు, హెచ్ఐవీ ఉన్నవారు, గర్భవతులు, హార్ట్ ట్రీట్ మెంట్ తీసుకుంటున్నవారు, డయాలసిస్, కేన్సర్ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నవారు, మూడు నెలల ముందు బ్లడ్ డొనేట్ చేసిన వారు, జ్వరం వస్తున్న వారు వాక్సిన్ వేసుకోరాదని వైద్య సిబ్బంది తెలిపారు.



కొబ్బరితోట పీహెచ్‌సీలో టీకాలు వేస్తున్న ఏఎన్ఎం

అపోహలతోనే నిరాసక్తత..

క్షయ వ్యాధి నివారణకు ఉచితంగా టీకా వేస్తున్నప్పటికీ దీనిపై ప్రజల్లో అనేక అపోహలు ఉన్నాయి. బీసీజీ టీకాల ద్వారా చేకూరే ప్రయోజనాలపై ప్రచార మాధ్యమాలు, కరపత్రాలు, పోస్టర్లు ఇతర ప్రచారాలు చేయకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తుంది. టీకా వేసుకున్న వారి చేతికి పుండు పడడం, నీరసంగా ఉండటంతో దీనిపై ప్రజలు నిరాసక్తత చూపిస్తున్నారు. వ్యాక్సినేషన్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా అయితే టీబీ వ్యాధికి అడ్డుకట్ట వేయడం కష్టమేనని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై విస్తృత ప్రచారానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

టీకా వేసుకుంటేనే మేలు..



టీబీ వ్యాధి సోకకుండా అర్హులైన వారు బీసీజీ టీకా వేసుకోవాలి. వ్యాక్సిన్ వేసుకున్న వారి చేతికి పుండు వస్తున్నా ఇది నెలరోజుల్లో మానిపోతుంది. అలా రావడం కూడా మందు పని చేస్తుందనడానికి సంకేతం. యూపీహెచ్‌సీ పరిధిలో లక్ష్యాన్ని అధిగమించేందుకు సిబ్బందితో కలిసి పని చేస్తున్నాం. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఇంటింటికీ వెళ్లి అర్హులైన వారికి టీకాలు వేస్తున్నాం.

–డాక్టర్ జయంత్, కొబ్బరితోట పీహెచ్‌సీ

కాలుష్యరహిత నగరంగా విశాఖ



ఆర్టీసీ బస్సు దిగుతున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం ఏపీఎస్ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుపోతున్న దృష్ట్యా జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను ఉపయోగించాలనే నిర్ణయం మేరకు అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణాను ఉపయోగిస్తున్నారన్నారు. ఎకో–వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో–జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా విశాఖ నగర పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు నిత్యం చేపడుతుందన్నారు.

అవినీతి అధికారులను శిక్షించాలి

డాబాగార్డెన్స్: ఫ్యామిలీ సర్టిఫికెట్ల జారీలో రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడం ద్వారా హక్కుదారులైన అనేక కుటుంబాలు ఆస్తులు కోల్పోయి వేదన అనుభవిస్తున్నాయని మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరపకుండా కొందరు అధికారులు అవినీతికి పాల్పడి కుటుంబ సభ్యునిగా ధ్రువీకరిస్తున్నారని ఆరోపించారు. తమకు చెందాల్సిన ఆస్తి వేరొక వ్యక్తి ఇటువంటి ఫ్యామిలీ సర్టిఫికెట్ పొంది తమ ఆస్తిని కాజేసే ప్రయత్నం చేసిన విషయాన్ని విశాఖ నగరానికి చెందిన తరుమెళ్ల వైష్ణవి ఫిర్యాదు చేశారన్నారు. ఆమె తండ్రి కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ ఎక్సైజ్ విభాగంలో అధికారిగా పని చేసేవారని, ఆమె తల్లితో 1991లో వివాహం అయిందని, 2007లో ఆమె తల్లి విడాకులు తీసుకున్నారని చెప్పారు. ఆ బాధితురాలి పేరిట కొంత ఆస్తి రాశారని, 2019లో ఆ యువతి తండ్రి అనారోగ్య సమస్యలతో మరణించిన తర్వాత ఆమె ఆస్తిని వేరొక మహిళ భార్యగా నకిలీ పత్రాలు సృష్టించి అపహరించిందని చెప్పారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే తగిన విచారణ జరిపించి వాస్తవాలు గ్రహించి సర్టిఫికెట్ రద్దు చేశారని తెలిపారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాలన్నారు.

క్లుప్తంగా

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు విద్యార్థినుల ఎంపిక



స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజీ

మహారాణిపేట: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ ఉమెన్ జూనియర్ కాలేజీ విద్యార్థినులు పి.శ్రీప్రద, డి.గమని భీమిలిలో జరిగిన ఎంపిక శిబిరంలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 19 బాస్కెట్ బాల్ టీమ్‌కు ఎంపికయ్యారు. ఇలా రాష్ట్ర స్థాయి ఇద్దరు విద్యార్థినులు ఎంపిక కావడం విశేషమని, వారిని అభినందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజీ తెలిపారు. ఒలింపిక్ క్రీడా సంవత్సరం కావడంతో కళాశాలలో క్రీడల పట్ల మరింత దృష్టి పెట్టి మెరుగైన శిక్షణ, సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బృందానికి సారథ్యం వహించిన ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎల్. ప్రవీణ్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు.

లాడ్జి నిర్మాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు



మహారాణిపేట: జీవీఎంసీ 29వ వార్డు కృష్ణానగర్‌లో నివాస గృహానికి అనుమతి తీసుకుని బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కృష్ణానగర్ వాసులు కోరారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కొంత మంది సోమవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. 200 గజాల్లో గృహ నిర్మాణానికి ప్లాన్ తీసుకుని, ఇప్పుడు లాడ్జి నిర్మిస్తున్నారని, ఈ ఏరియాలో లాడ్జి నిర్మాణం చేపడితే స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడతారని కృష్ణానగర్ వాసులు కలెక్టర్‌కు మొర పెట్టుకున్నారు. పిల్లల చదువులకు పరోక్షంగా ఇబ్బంది కలిగే అవకాశం ఉందని, తక్షణమే లాడ్జి పనులు నిలిపివేయాలని, నివాస గృహాల్లో వాణిజ్య సముదాయం నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు.

ఆశ్రమ భూములను స్వాధీనం చేసుకోవాలి

మహారాణిపేట : భూకబ్జాదారుల గుప్పిట్లో ఉన్న శ్రీ శాంతి ఆశ్రమం (యోగాశ్రమం) భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాణిజ్య సముదాయాలను తక్షణమే తొలిగించాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కోరారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మహా విశాఖ నగరపాలక సంస్థ, వార్డు 19వ వార్డు లాసన్స్‌బేకాలనీలో సముద్ర తీరానికి ఆనుకుని శ్రీ శాంతి ఆశ్రమానికి సంబంధించిన సుమారు పదెకరాల భూమి ఉందన్నారు. ప్రజలకు విద్య, వైద్యం అందించేందుకు స్వామి ఓంకార్ ఇచ్చారని తెలిపారు. ఆయన స్వర్గీయులైన తర్వాత కొందరు ప్రైవేట్ వ్యక్తులు కొంత భూమిని ఆధీనంలోకి తీసుకున్నారని తెలిపారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని అధునాతన ఫిష్ మార్కెట్ నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ముగిసిన ఆదివాసీల శిక్షణ, వర్క్‌షాప్



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న లేపాక్షి మేనేజర్

డాబాగార్డెన్స్: ఆదివాసీల అభివృద్ధికి లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్(ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ) గత రెండు నెలలుగా పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట గ్రామంలో నిర్వహించిన డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్, సవర ఆదివాసీ పెయింటింగ్ శిక్షణ సోమవారంతో ముగిసింది. లేపాక్షి ప్రిన్సిపాల్ సెక్రటరీ సునీత, ఎం. బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఎం. విశ్వ, పలువురు అధికారుల ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఫండ్ ద్వారా విశాఖపట్నం లేపాక్షి మేనేజర్ ఎ. కార్తీక్ నేతృత్వంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లేపాక్షి మేనేజర్ కార్తీక్ మాట్లాడుతూ రెండు నెలల శిక్షణలో డిజైనర్ శేషగిరి, 20 మంది ఆర్టిజన్స్ బృందం పాల్గొందని తెలిపారు. సరికొత్త ప్రొడక్ట్స్ 90 నుంచి 100 వరకు ఉత్పత్తి చేసేలా శిక్షణ అందించినట్లు తెలిపారు. జరిగిందన్నారు. కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్ రెండు పర్యాయాలు ఈ కేంద్రానికి వచ్చి శిక్షణ పొందిన వారిని అభినందించారన్నారు. అంతరించిపోతున్న ట్రైబల్ ఆర్ట్ ద్వారా జీవనం పొందడానికి మార్కెట్ సదుపాయం కూడా లేపాక్షి ద్వారా కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ బి. అనిల్‌కుమార్, లేపాక్షి సిబ్బంది పాల్గొన్నారు.

3 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు



రాచపోలమాంబ అమ్మవారు



ఉమాదేవి అమ్మవారు

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో, చెరువుగట్టులో వెలసిన శ్రీ రాచపోలమాంబ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబర్ 3వ తేదీ నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. 3వ తేదీ కలశ ప్రతిష్ఠ నిర్వహిస్తామని, అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 4.45 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేస్తామన్నారు. ఉదయం 7 గంటలకు ప్రథమ పూజ, బాలభోగం నుంచి సాయంత్రం నక్షత్ర హారతితో పూజాదికాలు ముగుస్తాయన్నారు.

ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని నిరసన



జీవీఎంసీ గాంధీ పార్కులో దీక్షలో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార: ఎల్ఐసీ ఆఫ్ ఇండియా విశాఖపట్నం, నెల్లూరు డివిజన్లలో 1993–97 వరకు ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి ద్వారా నియమించి, ముందస్తు నోటీసులు లేకుండా తొలగించిన తాత్కాలిక ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని మైలపల్లి ముత్యాలు, డి.సాల్మన్‌రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ పార్కులో ఆల్ ఇండియా నేషనల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఐఎన్‌టీయూసీ యూనియన్) నాయకులు ఐదు రోజుల పాటు శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 120 మంది విశాఖ, నెల్లూరు డివిజన్ల పరిధిలో వివిధ బ్రాంచిల్లో పని చేస్తున్నట్లు తెలిపారు. కోర్టు రూల్స్‌ని తుంగలో తొక్కి ముందస్తు సమాచారం లేకుండా నిర్దాక్షిణ్యంగా ఉద్యోగులను విధులు నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. మేనేజ్‌మెంట్ న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొల్ల ఈశ్వరరావు, దాడి నారాయణరావు, బొడ్డు అప్పారావు, కావలి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్‌పీలు

మహారాణిపేట : ఉద్యోగ సంఘం పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆర్‌పీలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ఆర్‌పీలు పాల్గొని ఉద్యోగ భద్రత కల్పించాలని, మూడు సంవత్సరాల పరిమితిని రద్దు చేయాలని, వేతనాలు వ్యక్తిగత అకౌంట్లలో వేయాలని, యూనిఫారం, ఐడీ కార్డులు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏపీ మెప్మా ఆర్‌పీ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు ఆర్థిక సాయం చేయాలి

మహారాణిపేట : కోవిడ్ కాలంలో ఎల్‌జీ పాలిమర్స్ విషవాయువు బాధితులైన తమకు ఆర్థిక సాయం చేయాలని ఆశ వర్కర్లు కోరారు. సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి పని చేశామని, ఎల్‌జీ పాలిమర్స్ విషవాయువు లీక్ వల్ల ఎన్నో ఇబ్బందులు పడ్డామని, కాని తమను ఎవరు పట్టించుకోలేదన్నారు. ఎల్‌జీ పాలిమర్స్ ద్వారా తమకు ఆర్థిక సాయం చేయాలని కోరారు.

స్వామి వివేకానంద సంస్థకు ఆటో అందజేత



ఆటో పత్రాలు సంస్థ అధ్యక్షుడు అప్పారావుకు అందజేస్తున్న కంచర్ల కుటుంబ సభ్యులు

డాబాగార్డెన్స్: ప్రముఖ సంఘ సేవకులు కంచర్ల రాంప్రసాద్, కంచర్ల అన్నపూర్ణమ్మ స్వామి వివేకానంద సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు సంబంధించి ఐదేళ్ల కిందట ఓ ఆటో బహూకరించారు. కరోనా సమయంలో ఆ ఆటో ద్వారా నిరుపేదలు, అన్నార్తులకు భోజనాలు, ప్రతిరోజూ ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో పేషెంట్ల సహాయకులకు భోజన ప్యాకెట్లు అందజేసేందుకు ఉపయోగించేవారు. అలాగే సంస్థలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, నిరాశ్రయులను ఆటవిడుపుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఈ ఆటో ద్వారానే తీసుకెళ్లేవారు. ఆ ఆటో ప్రస్తుతం మరమ్మతులకు గురైన దృష్ట్యా మరో ఆటోను సోమవారం వారు అందజేశారు. అన్ని విధాలుగా సంస్థకు సహాయ సహకారాలు అందిస్తున్న కంచర్ల సుగుణ కుటుంబ సభ్యులు, కేఆర్ బ్రహ్మం అండ్ సన్స్ సంస్థకు సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు తక్షణం పరిష్కరించాలి



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జ్ఞానాపురం జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 5 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము నేరుగా వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 2 వినతులు అందినట్లు జెడ్సీ రాము తెలిపారు. వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈలు మత్స్యరాజు, తారా ప్రసన్నరెడ్డి, ఏసీపీ ఇన్‌చార్జి విజయకుమార్, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ. సునీల్‌కుమార్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి, మంచినీటి విభాగం ఈఈ సూరిశెట్టి శేఖర్, ఏఈ మోహన్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు రక్షణకు ఎన్నాళ్లయినా ఉద్యమం



జీవీఎంసీ గాంధీ పార్కులో దీక్షలో పాల్గొన్న ఐద్వా నాయకులు

సీతమ్మధార: విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపేస్తున్నట్లు బీజేపీ ప్రభుత్వం ప్రకటించే వరకు ఎన్ని సంవత్సరాలైనా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో దీక్షలు 1282వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ప్రజలు చేసిన పోరాట ఫలితమే అన్నారు. మోదీ ప్రభుత్వం మెడలు వంచి స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిలిపేసే వరకు సాగిస్తామన్నారు. పర్మినెంట్ ఉద్యోగుల తగ్గింపు, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి, కె. కుమారి, బి.మమత, కె.మణి, బి.భారతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీతాల బిల్లుల్లో జాప్యం తొలగించాలని వినతి



జీవీఎంసి కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సంఘం నాయకులు

మహారాణిపేట: జీవీఎంసి పరిధిలో పని చేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులకు సంబంధించిన జీతాల బిల్లుల ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను కమిషనర్‌కు వివరించామని ఏపీ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సంఘం నాయకుడు గణేష్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ ఎంప్లాయీస్ గౌరవ అధ్యక్షుడు మహాదేవ ఆనంద్ ఆధ్వర్యంలో సంఘ నాయకులు జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గణేష్‌కుమార్ మాట్లాడుతూ మోనిటరింగ్ సెల్‌లో పని చేస్తున్న కొంత మంది ఉద్యోగుల నిర్లక్ష్యం వల్ల జీతాల బిల్లుల్లో జాప్యం జరుగుతోందన్నారు. ఈ సమస్య పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, దీనికి కారకులైన ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలి కమిషనర్‌ను కోరినట్టు గణేష్‌కుమార్ వివరించారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించి తదుపరి సమీక్ష సమావేశానికి పూర్తి సమాచారంతో ఉద్యోగ సంఘ నాయకులు హాజరు కావాలని కోరినట్లు నాయకులు వివరించారు. కార్యక్రమంలో స్టేట్ ట్రెజరర్ చింతకాయల బంగారా జు, విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎన్.వి.ఎస్. సందీప్, జిల్లా నాయకులు బి.వి. అశోక్‌కుమార్, ఎస్. సాయికృష్ణ, ఈ. పవన్‌కుమార్, సురేంద్ర, సిద్ధార్థ వర్మ తదితరులు పాల్గొన్నారు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రాము

కంచరపాలెం: జోనల్ అధికారులు సమన్వయంతో పని చేస్తే ప్రజలకు సక్రమంగా మౌలిక సదుపాయాలు కల్పించగలమని జోన్–5 జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము అన్నారు. జ్ఞానాపురంలోని జోన్–5 జోనల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జీవీఎంసీ 40వ వార్డు నుంచి 63వ వార్డు వరకు గల పలు విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జోన్ పరిధిలో కొండవాలు, మురికివాడలు, పారిశ్రామిక ప్రాంతాలు అధికంగా ఉండడంతో అభివృద్ధి పనులు పూర్తికావడానికి జాప్యం జరుగుతోందన్నారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టేలా ఇంజినీరింగ్ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జోన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ వార్డులో సంబంధిత అధికారులతో వార్డు పర్యటన ఉంటుందన్నారు. పారిశుధ్య పనులు పబ్లిక్ హెల్త్ అధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజా సమస్యలను ఉపేక్షిస్తే ఉన్నత అధికారులు నుంచి దిగువ స్థాయి సిబ్బంది వరకు చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశ్రామిక ప్రాంతాల నుంచి రెవెన్యూ వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ ఆర్‌వోలకు జెడ్సీ సూచించారు. టౌన్‌ప్లానింగ్, విద్యుత్‌లైట్లు, మంచి నీరు, కాలువలు, రోడ్లు వంటి సమస్యలపై ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వినతులు వస్తున్నాయన్నారు.